56

# చందూ - నందూ

"ఒరేయి చందూ... ఇవాళ నువ్వు మా ఇంటికి తప్పక రావాలిరా!" అన్నాడు నందు.

"అదేమిటిరా- నేను తరుచుగా మీ ఇంటికి వస్తూనే ఉంటాను కదా !" అన్నాడు చందూ నవ్వుతూ.

"అది కాదురా. ఇవాళ నా పుట్టిన రోజు... అందుకని!" అన్నాడు నందు సంతోషంగా.

"అల్లాగా... అయితే తప్పకుండా వస్తానురా !" అన్నాడు చందూ.

◦ ◦ ◦

ఆ సాయంత్రం చందూ నందు ఇంటికి వెళ్లాడు.

నందూ వాళ్ళమ్మ రెండు ప్లేట్లలో మిఠాయిలు తెచ్చి ఇద్దరి మధ్య ఒక బల్ల వేసి దానిమీద పెట్టింది. ఆ రెండింటిలో ఒక ప్లేట్లో మిఠాయిలు కొంచెం ఎక్కువ ఉన్నాయి. దానిని ఆమె చందూ ముందు పెట్టింది.

చందూ చేతులు కడుక్కోడానికి అవతలికి వెళ్లాడు.

వెంటనే నందు- తన ముందు ప్లేటుని చందూ ముందు పెట్టి, చందూ ముందు వున్న ప్లేటుని తనముందు పెట్టుకుని ఏమీ ఎరగనట్లు కూర్చున్నాడు. చందూ వచ్చి ఈ విషయం గమనించి తనలో తానే నవ్వుకున్నాడు. పైకి మాత్రం ఏమీ అనలేదు.

◦ ◦ ◦

మరి కొన్నాళ్ళకి చందు పుట్టిన రోజు వచ్చింది.

ఆరోజు సాయంత్రం నందూని తన ఇంటికి పిలిచాడు.

ఇద్దరూ సరదాగా మాట్లాడుకుంటుంటే, చందూ వాళ్ళ అమ్మ ఇద్దరికీ మిఠాయిలు



తెచ్చింది. ఒక ప్లేటులో కొంచెం ఎక్కువ తెచ్చి దానిని తన కొడుకు చందూ ముందు పెట్టి, తక్కువ ఉన్న ప్లేటుని నందూ ముందు ఉంచి, లోనికి వెళ్లిపోయింది.

చందూ వెంటనే తన ముందున్న ప్లేటుని తీసి నందూ ముందు ఉంచి, అతని ముందున్న ప్లేటుని తన ముందు పెట్టుకున్నాడు.

నందూ– "వద్దు... పర్వాలేదు" అన్నా వినలేదు.

"నువ్వు తిను నందూ! మా ఇంట్లో చేసినవేగా, నేను ఎక్కువ తినగలను. అయినా... మనకి ఉన్నవి ఇతరులకి ఇయ్యడంలో ఎంతో ఆనందం ఉంది. మనకంటే ఎప్పుడూ ఇతరులకు ఎక్కువ ఇయ్యాలి. వాళ్ళు ఆనందం పొందడంకంటే మనకింకేం కావాలి! మన మూలంగా ఇందరు సంతోషపడుతున్నారని తెలిస్తే, మన మనస్సు ఎంతో ఆనందిస్తుంది" అన్నాడు చందూ.

నందూకి – అంతకుముందు తాను చందూ విషయంలో ప్రవర్తించిన పద్ధతి జ్ఞాపకానికి వచ్చింది. సిగ్గుతో తలదించుకుపోయింది. ఆ విషయాన్ని కూడా ఎత్తకుండా తన పట్ల ఎంతో ప్రేమ చూపించిన చందూ ఎంత గొప్పవాడో ననిపించింది . ఇంక ముందు తాను అల్లాగే ఉండాలనుకున్నాడు.

లోపల గదిలో నుంచి వీళ్ళ సంభాషణ అంతా చందూ అమ్మ వింటూనే ఉంది.

తాను చేసిన పనికి ఆమెకే సిగ్గువేసింది.

చిన్నవాడైనా చందూ, తనకి చక్కగా బుద్ధి చెప్పాడనుకుంది. తనకి అటువంటి కొడుకు కలిగినందుకు మురిసి పోయింది. ఇక ముందెప్పుడూ చక్కగా ప్రవర్తించాలనుకుంది.

★★★